


# కడప మనస్సాక్షి

తెలుగు దినపత్రిక

PRGI Reg.No: APTEL/26/A0309

KADAPA MANASSAKSHI - Telugu Daily





వైయస్ఆర్ కడప/అన్నమయ్య | ఎడిటర్ : వసంత శ్రీనివాసుల రెడ్డి | సంపుటి : 01 సంచిక : 156 | శుక్రవారం, 19 జూన్ 2026 | పేజీలు : 4 | వెల.రూ.2/-





## ఆక్వా రైతులకు ఊరట: కిలోకు రూ.4 తగ్గనున్న ఆక్వా ఫీడ్ ధర



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆక్వా రైతులకు భారీ ఉపశమనం కలిగించేలా ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులపై ఆక్వా రైతులు మరియు ఆక్వా ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆక్వా రైతులపై రోజురోజుకు పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాల (పెట్టుబడి ఖర్చుల) భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఎం చంద్రబాబు నాయుడు ప్రతినిధులకు సూచించారు. ముఖ్యమంత్రి చేసిన ఈ విజ్ఞప్తిని, ఆక్వా రంగ ప్రయోజనాలను సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఆక్వా ఫీడ్ తయారీ సంస్థలు మార్కెట్‌లో ఫీడ్ ధరలను తగ్గించేందుకు అంగీకరించాయి. ఇందులో భాగంగా ఆక్వా ఫీడ్ ధరను ప్రతి కిలోకు రూ.4 చొప్పున తగ్గించాలని అధికారికంగా నిర్ణయించారు.ప్రభుత్వం మరియు ఫీడ్ తయారీ సంస్థల మధ్య జరిగిన ఈ చర్చల సఫలీకృతం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది ఆక్వా రైతులకు సాగు ఖర్చులు గణనీయంగా తగ్గి, పెద్ద ఎత్తున ఆర్థిక ఉపశమనం లభించనుంది. ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆక్వా రంగం స్థిరమైన అభివృద్ధి సాధించడానికి, అలాగే నష్టాల్లో ఉన్న రైతుల సంక్షేమాన్ని కాపాడటానికి కూటమి ప్రభుత్వం భవిష్యత్తులోనూ అన్ని రకాల అవసరమైన చర్యలను నిరంతరం కొనసాగిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసినట్లు సమాచారం.

# పోలీసుల తీరుపై వైఎస్ జగన్ మండిపాటు

విజయవాడ: గాదె సాయికృష్ణ అదృశ్యం వ్యవహారంలో రాష్ట్ర పోలీసుల తీరు అత్యంత అమానుషంగా మరియు బాధ్యతారాహిత్యంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తార్ను. బాధితుడి కుటుంబానికి వైసీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశార్ను. మీడియా సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడుతూ ఈ కేసులోని దారుణాలను వెల్లడించార్ను. "గత నెల మే 9వ తేదీన సాయికృష్ణను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకువెళ్లార్ను. అప్పటి నుంచి తన కుమారుడు ఎక్కడ ఉన్నాడో చెప్పాలని, అతడి ప్రాణాలకు ఏమైందోనని సాయికృష్ణ తల్లి పోలీసులను పలుమార్లు వేడుకుంద్ని. రోజుల తరబడి ఆ పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగినా ఏ ఒక్క అధికారి కూడా ఆమెకు సరైన సమాధానం ఇవ్వలేదు" అని జగన్ ఆవేదన వ్యక్తం చేశార్ను. పోలీసుల నిర్లక్ష్యం ఏ స్థాయికి చేరిందంటే.. "న్యాయం కోసం పోలీస్ స్టేషన్ మెట్లెక్కిన ఆ కన్నతల్లికి.. 'నీ కొడుకు ఇక రాడు, ఫోటోకు దండ వేసుకో' అని పోలీసులు అత్యంత క్రూరంగా సమాధానమిచ్చారు" అని వైఎస్ జగన్ తీవ్రంగా విమర్శించార్ను. బాధ్యత గల స్థానంలో ఉండి ఒక తల్లి ఆవేదనను అపహాస్యం చేయడం పోలీసుల అరాచక పాలనకు అద్దం పడుతోందన్నార్ను. అంతేకాకుండా, ఆమె ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదును కూడా కనీసం స్వీకరించకుండా చెత్తబుట్టలో పడేశారని జగన్ మండిపడ్డార్ను.



స్థానిక పోలీసులపై నమ్మకం లేకపోవడం, చట్టాన్ని రక్షించాల్సిన వారే అన్యాయానికి ఒడిగట్టడంతో.. న్యాయం కోసం సాయికృష్ణ తల్లి చివరకు హైకోర్టును ఆశ్రయించి 'యస్ కార్పస్' పిటిషన్ దాఖలు చేయాల్సిన దుస్థితి వచ్చిందని జగన్ గుర్తుచేశార్ను. ఈ ఘోర ఘటన వెనుక ఉన్న పూర్తి నిజాలు తక్షణమే వెలుగులోకి రావాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం బాధ్యులను కఠినంగా శిక్షించాలని వైఎస్ జగన్ డిమాండ్ చేశార్ను.

## భూకబ్జాదారులపై కఠిన చర్యలు తప్పవు: సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక



హైదరాబాద్: వనస్థలిపురం ప్రాంతంలో దేవుడి భూములను సైతం కొందరు కబ్జా చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మరియు దేవాలయ భూములను ఆక్రమించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. భూకబ్జాల వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు, ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకే తమ ప్రభుత్వం 'హైడ్రా' వ్యవస్థను తీసుకొచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే, కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం హైడ్రాను ఒక భూతంలా చిత్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అక్రమ ఆక్రమణలను పూర్తిగా తొలగించి, ప్రజా ఆస్తులను కాపాడటమే హైడ్రా యొక్క ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. నగర భవిష్యత్తు కోసం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమానికి కొందరు కావాలనే అడ్డంకులు సృష్టిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేవలం పర్యావరణ పరిరక్షణ, హైదరాబాద్ నగర భవిష్యత్తును మాత్రమే దృష్టిలో పెట్టుకొని ఈ కార్యక్రమాలను తాము అమలు చేస్తున్నామని చెప్పారు.దేశ రాజధాని ఢిల్లీతో పాటు దేశంలోని పలు ప్రధాన నగరాలు ప్రస్తుతం తీవ్రమైన వాయు కాలుష్య సమస్యలను ఎదుర్కొంటున్నాయని సీఎం గుర్తుచేశారు. భవిష్యత్తులో మన హైదరాబాద్ నగరానికి అలాంటి దుస్థితి రాకుండా ముందస్తు జాగ్రత్తగా పెద్ద ఎత్తున మొక్కల పెంపకం (హరితహారం) కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. నగరంలో పచ్చదనాన్ని భారీగా పెంచడం ద్వారా హైదరాబాద్‌ను కాలుష్య రహిత మహానగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# 'జీరో కల్టివేషన్' సాధించిన విశాఖ రేంజ్ పోలీసులు : హోం మంత్రి వంగలపూడి అనిత



అనకాపల్లి, జూన్ 18: మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా విశాఖపట్నం రేంజ్ పోలీసులు చారిత్రాత్మక విజయం సాధించారు. బుధవారం అనకాపల్లి జిల్లా పరవాడలో 490 కేసులకు సంబంధించిన సుమారు 20,876 కేజీల గంజాయిని, 23.68 కేజీల హషీష్ ఆయిల్‌ను సీనియర్ పోలీసు అధికారుల సమక్షంలో బహిరంగంగా ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. గంజాయి నెట్‌వర్క్‌లను సమూలంగా ధ్వంసం చేస్తూ, గిరిజన రైతులకు లాభదాయకమైన ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పిస్తున్నామని తెలిపారు. యువతను ఈ మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. విశాఖపట్నం రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ.. జులై 2024లో తాము నిర్దేశించుకున్న 'జీరో కల్టివేషన్' (గంజాయి సాగు లేని స్థితి) లక్ష్యాన్ని జనవరి 2026 నాటికి 100 శాతం సాధించామని వెల్లడించారు. 2021-22లో ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే 7,515 ఎకరాలుగా ఉన్న గంజాయి సాగును, డ్రోన్ల నిఘా మరియు ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంతో ప్రస్తుతం 0 ఎకరాలకు తీసుకువచ్చామని ప్రకటించారు. రేంజ్ పరిధిలో 1,142 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి, 3,377 మందిని అరెస్ట్ చేశాము. 65,560 కేజీల గంజాయి, 83.19 కేజీల హషీష్ ఆయిల్, రవాణాకు వాడిన 832 వాహనాలను స్వాధీనం చేసుకున్నాము. రూ.11.02 కోట్ల విలువైన డ్రగ్స్ సంబంధిత ఆస్తులను ఫ్రీజ్ చేశాము. 132 మందిపై పిట్ ఎన్‌డీపీఎస్ ప్రతిపాదనలు సిద్ధం చేయగా, 51 మందిని నిర్బంధంలో ఉంచాము.పరవాడలో అంతర్జాతీయ శ్రీలంక డ్రగ్స్ మాఫియాతో సంబంధమున్న ముఠాను ఛేదించి, రూ.1.07 కోట్ల విలువైన 213.360 కేజీల గంజాయిని పట్టుకున్నాము. అలాగే అన్నవరంలో రూ.1.04 కోట్ల విలువైన 209 కేజీల గంజాయితో తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేశాము.గంజాయి సాగు మానేసిన గిరిజన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటల కోసం 29,840 ఎకరాల్లో 1.59 కోట్ల మొక్కలను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే 415 మంది యువతకు ఉపాధి కోసం నైపుణ్య శిక్షణ, 80 మంది మహిళలకు టైలరింగ్‌లో ఉపాధి శిక్షణ ఇచ్చామన్నారు. రేంజ్ పరిధిలో నిర్వహించిన 22,050 అవగాహన కార్యక్రమాల ద్వారా సుమారు 12.72 లక్షల మంది ప్రజల్లో చైతన్యం తెచ్చామని, దీనివల్ల 234 గ్రామాలు 'డ్రగ్-ఫ్రీ గ్రామాలు'గా నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ విస్తృత కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుతో పాటు ఐదు జిల్లాల సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అమిత్ బర్దర్ (అల్లూరి సీతారామరాజు), తుహిన్ సిన్హా (అనకాపల్లి), ఏ.ఆర్.దామోదర్ (విజయనగరం), ఎస్.వి.మాధవ్ రెడ్డి (పార్వతీపురం మన్యం), కె.వి.మహేశ్వర్ రెడ్డి (శ్రీకాకుళం) మరియు ఇతర ఉన్నత పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కడప మనస్సాక్షి
తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily



# అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం' వర్తింపు: మంత్రి నారా లోకేష్ కీలక నిర్ణయం

అమరావతి (కడప మనస్సాక్షి), జూన్ 19: రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖపై ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షా సమావేశంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ ఒక మానవీయమైన, కీలకమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు సైతం ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ఖచ్చితంగా అందాలన్న సంకల్పంతో, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'తల్లికి వందనం' పథకాన్ని అనాథ పిల్లలకు కూడా వర్తింపజేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకం అమలు కోసం అనాథ పిల్లల యొక్క గార్డియన్ల (సంరక్షకుల) వివరాలను అత్యంత ఖచ్చితత్వంతో సేకరించాలని మంత్రి లోకేష్ అధికారులను పురమాయించారు. ఒకవేళ పిల్లలకు ఎవరూ లేని పక్షంలో, ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్లకు పంపి, వారి పర్యవేక్షణలో పిల్లలకు చేరేలా చూడాలన్నారు. అంతేకాకుండా, సదరు అనాథ పిల్లల పేర్లపైనే ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతాలను తెరిచి, పథకం నిధులను అందులో జమ చేయాలని సూచించారు. ఆ పిల్లలు తమ చదువు పూర్తి చేసుకున్న తర్వాత, ఆ మొత్తాన్ని వారి స్వతంత్ర అవసరాల కోసం స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇది వారి భవిష్యత్తుకు ఒక బలమైన ఆర్థిక రక్షణగా నిలుస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కడప మోడల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలి. ఇప్పటికే పంపిణీ ప్రారంభమైన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్లను పాఠశాలల్లో నిర్వహించే మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీపీ -౩ూూ) సమయానికి పూర్తి చేయాలి. రాష్ట్రంలోని 430 కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ - ఖ+దీఎ) చదువుతున్న 1,06,360 మంది విద్యార్థినుల సౌకర్యార్థం 53,180 బంక్ బెడ్లను వెంటనే ఏర్పాటు చేయాలి. ఈ సదుపాయాన్ని ఆంధ్రప్రదేశ్ (ఞూ) రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలకు కూడా విస్తరించాలి. తెలుగు అకాడమీ ముద్రించే పుస్తకాలను ప్రజలకు సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రముఖ ఈ-కామర్స్ ప్లాట్‌ఫార్మ్‌ల ద్వారా విక్రయించడానికి చర్యలు తీసుకోవాలి. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తాతో పాటు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ రికార్డు దిశగా ఎలాన్ మస్క్ సంస్థ




న్యూయార్క్ : ప్రపంచ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అత్యంత భారీ ఐపీఓలలో ఒకటిగా నిలవబోతున్న స్పేస్‌ఎక్స్ ప్రజా వాటాల విక్రయానికి ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. టెక్నాలజీ రంగ దిగ్గజ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ చేపట్టనున్న ఈ భారీ ఐపీఓ ఇప్పటికే ప్రపంచ ఆర్థిక వర్గాల్లో ప్రధాన చర్చాంశంగా మారింది. అంతర్జాతీయ ఆర్థిక వర్గాల సమాచారం ప్రకారం, స్పేస్‌ఎక్స్ సమీకరించాలనుకుంటున్న నిధుల కంటే అనేక రెట్లు ఎక్కువ స్థాయిలో పెట్టుబడిదారుల ఆసక్తి వ్యక్తమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సంస్థాగత పెట్టుబడిదారులు భారీ మొత్తంలో షేర్ల కొనుగోలుకు ముందుకొచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే బిలియన్ల డాలర్ల విలువైన కొనుగోలు ఆర్డర్లు నమోదయ్యాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. స్పేస్‌ఎక్స్ ఈ ఐపీఓ ద్వారా సుమారు 75 బిలియన్ డాలర్ల నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ప్రస్తుత అంచనాల ప్రకారం కంపెనీ విలువ 1.75 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశముంది. ఈ స్థాయిలో విలువను అందుకుంటే ప్రపంచంలోని అత్యంత విలువైన టెక్నాలజీ సంస్థల జాబితాలో స్పేస్‌ఎక్స్ కీలక స్థానం దక్కించుకోనుంది. ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద ఐపీఓ రికార్డు సౌదీ అరామ్‌కో పేరిట ఉంది. 2019లో ఆ సంస్థ సుమారు 29.4 బిలియన్ డాలర్లను సమీకరించి చరిత్ర సృష్టించింది. అయితే స్పేస్‌ఎక్స్ లక్ష్యంగా పెట్టుకున్న నిధుల సమీకరణ ఆ రికార్డును భారీ తేడాతో అధిగమించే అవకాశం ఉ ందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. స్పేస్‌ఎక్స్‌పై పెట్టుబడిదారుల విశ్వాసానికి ప్రధాన కారణం సంస్థ సాధించిన సాంకేతిక విజయాలే. స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలు ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తుండగా, పునర్వినియోగ రాకెట్ సాంకేతికతలో స్పేస్‌ఎక్స్ ఇప్పటికే అగ్రస్థానంలో నిలిచింది. భవిష్యత్తులో చంద్రుడు, అంగారక గ్రహ యాత్రలకు సంబంధించిన ప్రాజెక్టులు, అంతరిక్ష ఆధారిత కమ్యూనికేషన్ వ్యవస్థలు, కృత్రిమ మేధస్సు రంగాల్లో సంస్థ ప్రణాళికలు పెట్టుబడిదారుల్లో మరింత ఆశావాదాన్ని పెంచుతున్నాయి. మార్కెట్ వర్గాల అంచనాల ప్రకారం, ఐపీఓకు వచ్చిన డిమాండ్ ఇప్పటికే అందుబాటులో ఉన్న షేర్లను మించి వెళ్లింది. కొందరు విశ్లేషకులు దీనిని ఆధునిక ఆర్థిక చరిత్రలోనే అత్యంత ఆసక్తికరమైన ప్రజా వాటాల విక్రయంగా అభివర్ణిస్తున్నారు. స్పేస్‌ఎక్స్ షేర్లకు లభిస్తున్న స్పందనను బట్టి చూస్తే, ఈ ఐపీఓ ప్రపంచ పెట్టుబడి మార్కెట్లలో కొత్త రికార్డులకు నాంది పలికే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మరోవైపు, కంపెనీ విలువ అంచనాలు అత్యంత భారీ స్థాయిలో ఉండటం, భవిష్యత్ ఆదాయాలపై ఆధారపడిన వ్యాపార నమూనా కారణంగా పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని కొందరు ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అయినప్పటికీ, ఎలాన్ మస్క్ నాయకత్వం, స్పేస్‌ఎక్స్ సాంకేతిక ఆధిపత్యం, భవిష్యత్ వృద్ధి అవకాశాలు ఈ ఐపీఓను ప్రపంచ మార్కెట్లలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆఫరింగ్‌గా నిలిపాయి

# హైదరాబాద్‌లోకి యెజ్డీ, బీఎస్ఏ కొత్త స్క్రాంబ్లర్ బైకులు




హైదరాబాద్ : ద్విచక్ర వాహన ప్రియులను ఆకట్టుకునేందుకు యెజ్డీ, బీఎస్ఏ బ్రాండ్‌లు తమ సరికొత్త స్క్రాంబ్లర్ మోటార్‌సైకిళ్లను హైదరాబాద్ మార్కెట్లో విడుదల చేశాయి. క్లాసిక్ లెజెండ్స్ సంస్థకు చెందిన ఈ ప్రముఖ బ్రాండ్‌లు 'యెజ్డీ స్క్రాంబ్లర్ 350', 'బీఎస్ఏ స్క్రాంబ్లర్ 650' మోడళ్లను అధికారికంగా అందుబాటులోకి తీసుకొచ్చాయి. నగర రహదారులతో పాటు హైవేలు, కఠినమైన ఆఫ్‌రోడ్ మార్గాల్లోనూ అద్భుతమైన పనితీరును అందించేలా ఈ బైకులను రూపొందించారు. యువ రైడర్లను లక్ష్యంగా చేసుకుని శక్తివంతమైన ఇంజన్లు, ఆధునిక సాంకేతికత, క్లాసిక్ డిజైన్‌లతో ఈ మోడళ్లను అభివృద్ధి చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. మోటార్‌సైక్లింగ్ ప్రపంచంలో ఎస్‌యూవీ తరహా అనుభూతిని అందించే వాహనాలుగా ఇవి నిలుస్తాయని క్లాసిక్ లెజెండ్స్ సహ వ్యవస్థాపకుడు అనుపమ్ థరేజా పేర్కొన్నారు. భారతదేశంలోనే అత్యంత తేలికైన 350 సీసీ స్క్రాంబ్లర్ బైక్‌గా యెజ్డీ స్క్రాంబ్లర్ 350 ప్రత్యేక గుర్తింపు పొందింది. సరికొత్త లిక్విడ్ కూల్డ్ కటార్ ఇంజన్‌తో రూపొందిన ఈ బైక్ అద్భుతమైన టార్క్-టు-వెయిట్ నిష్పత్తిని కలిగి ఉంది. ప్రారంభ ఆఫర్ కింద ఈ మోడల్ ఎక్స్-షోరూమ్ ధర రూ. 1,99,950గా నిర్ణయించారు. ఇక బీఎస్ఏ స్క్రాంబ్లర్ 650 బ్రిటీష్ క్లాసిక్ స్టైల్‌ను ప్రతిబింబించేలా రూపొందించబడింది. గోల్డ్ స్టార్ కటాలినా డిజైన్ ప్రభావంతో వచ్చిన ఈ బైక్ దేశంలోనే ఏకైక 650 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజన్‌తో శక్తిని అందిస్తుంది. తక్కువ, మధ్యస్థ వేగాల్లో అత్యుత్తమ టార్క్‌ను అందించే ఈ ప్రీమియం మోడల్ ప్రారంభ ధర రూ. 3,24,950గా ఉంది. వినియోగదారుల నమ్మకాన్ని పెంచేందుకు కంపెనీ ప్రత్యేక వారెంటీ సదుపాయాలను కూడా ప్రకటించింది. ఈ రెండు మోడళ్లపై 4 సంవత్సరాలు లేదా 50,000 కిలోమీటర్ల వరకు ప్రామాణిక వారెంటీ లభిస్తుంది. అదనంగా వారెంటీని 6 సంవత్సరాల వరకు పొడిగించుకునే అవకాశం కూడా కల్పించారు. ఒక సంవత్సరం పాటు ఉచిత రోడ్‌సైడ్ సహాయం సేవలతో పాటు దేశవ్యాప్తంగా 400కిపైగా సర్వీస్ కేంద్రాల మద్దతును సంస్థ అందిస్తోంది. క్లాసిక్ డిజైన్, ఆధునిక సాంకేతికత, ఆఫ్‌రోడ్ సామర్థ్యాల కలయికతో వచ్చిన ఈ కొత్త స్క్రాంబ్లర్ మోడళ్లు హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా అడ్వెంచర్ బైక్ ప్రేమికులను ఆకట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఎల్పీజీ కొరతతో ఐఆర్‌సీటీసీ కీలక నిర్ణయం.. రైళ్లలో మళ్లీ వంటలు

న్యూఢిల్లీ : పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంతో దేశవ్యాప్తంగా వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల కొరత ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల ఆహార సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో భద్రతా కారణాలతో నిలిపివేసిన కదులుతున్న రైళ్లలో వంట చేసే విధానాన్ని మళ్లీ అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. అయితే ఈసారి సంప్రదాయ గ్యాస్ స్టవ్‌ల స్థానంలో పూర్తిగా విద్యుత్ ఆధారిత ఇండక్షన్ స్టవ్‌లను వినియోగిస్తూ ఆహార తయారీ చేపట్టనుంది. దేశవ్యాప్తంగా ప్రతిరోజూ సుమారు 17 లక్షల భోజనాలను 1,400కు పైగా రైళ్లలో ఐఆర్‌సీటీసీ సరఫరా చేస్తోంది. ఈ భారీ వ్యవస్థను నిరంతరాయంగా కొనసాగించేందుకు విద్యుత్ సదుపాయం కలిగిన ఎల్‌హెచ్‌బీ ప్యాంట్రీ కార్లలో వంట ప్రక్రియను ప్రారంభించింది. రాజధాని, శతాబ్ది, దురంతో, వందే భారత్ వంటి ప్రీమియం రైళ్లలో ఇప్పటికే ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు వినియోగంలో ఉ ండటంతో ఈ మార్పు అమలు సులభమవుతుందని అధికారులు భావిస్తున్నారు. అంతేకాకుండా ప్రధాన రైల్వే స్టేషన్లలో ఇండక్షన్ ఆధారిత వంటకు అవసరమైన విద్యుత్ మౌలిక సదుపాయాలను కూడా సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గ్యాస్ సరఫరాలో ప్రాధాన్యత కల్పించాలని ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్తాన్ పెట్రోలియం సంస్థలతో ప్రత్యేక ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న బేస్ కిచెన్లు, క్లస్టర్ కిచెన్లు, క్యాటరింగ్ యూనిట్ల నిర్వహణకు రోజుకు సుమారు వెయ్యి వాణిజ్య ఎల్పీజీ సిలిండర్లు అవసరమవుతున్నాయి. గ్యాస్ కొరత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైల్వే స్టేషన్లలోని ఫుడ్ ప్లాజాలు, రిఫ్రెష్‌మెంట్ గదులు, జన ఆహార్ కేంద్రాలు కూడా ఇండక్షన్ కుక్కర్లు, మైక్రోవేవ్ ఓవెన్ల వినియోగాన్ని పెంచాలని ఐఆర్‌సీటీసీ సూచించింది. ఈ మార్పుల వల్ల రైల్వే క్యాటరింగ్ వ్యవస్థలో జరిగే మొత్తం వంట ప్రక్రియలో దాదాపు 60 శాతం వరకు విద్యుత్ ఆధారిత విధానానికి మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇంధన సరఫరాలో ఏర్పడిన అంతరాయం కారణంగా ఐఆర్‌సీటీసీ ఆర్థిక పరిస్థితిపై కూడా ప్రభావం పడినట్లు సమాచారం. ముడి సరుకులు, గ్యాస్ ధరలు పెరగడంతో క్యాటరింగ్ విభాగం లాభదాయకత తగ్గినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయినప్పటికీ ప్రయాణికులకు ఆహార సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వేగంగా అమలు చేస్తున్నట్లు సంస్థ స్పష్టం చేసింది

# ఉజ్వల లబ్ధిదారులకు షాక్.. సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు 9 నుంచి 4కు కుదింపు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) లబ్ధిదారులకు కీలక మార్పు ప్రకటించింది. ఇప్పటివరకు ఏడాదికి 9 సబ్సిడీ ఎల్పీజీ సిలిండర్లపై అందుతున్న రాయితీని ఇకపై కేవలం 4 సిలిండర్లకే పరిమితం చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉజ్వల లబ్ధిదారులపై ప్రభావం పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. 2016లో ప్రారంభమైన ఉజ్వల పథకం కింద పేద కుటుంబాలకు ఉచిత ఎల్పీజీ కనెక్షన్లు అందించడంతో పాటు సబ్సిడీ ప్రయోజనాలు కల్పించారు. ప్రారంభంలో ఏడాదికి 12 సబ్సిడీ సిలిండర్లకు అర్హత ఉండేది. అనంతరం ఈ సంఖ్యను 9కు తగ్గించగా, తాజాగా మరోసారి కోత విధిస్తూ 4 సిలిండర్లకే పరిమితం చేశారు. ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా లబ్ధిదారుల సగటు వినియోగాన్ని ప్రభుత్వం పేర్కొంటోంది. పెట్రోలియం మంత్రిత్వ శాఖ అధికారుల ప్రకారం, ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లు పొందిన కుటుంబాలు సగటున ఏడాదికి నాలుగు సిలిండర్లను మాత్రమే వినియోగిస్తున్నట్లు గణాంకాలు వెల్లడించాయి. అదే వినియోగ స్థాయిని దృష్టిలో పెట్టుకుని సబ్సిడీ పరిమితిని నిర్ణయించినట్లు అధికారులు వివరించారు. అలాగే సబ్సిడీ సిలిండర్ల దుర్వినియోగం, అక్రమ విక్రయాలు, పక్కదారి పట్టింపు వంటి అంశాలు కూడా ప్రభుత్వ ఆందోళనకు కారణమైనట్లు సమాచారం. కొంతమంది లబ్ధిదారుల పేర్లతో తక్కువ ధరకు పొందిన సిలిండర్లను ఇతరులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సబ్సిడీ వ్యవస్థను మరింత లక్ష్యబద్ధంగా మార్చేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే సబ్సిడీ పూర్తిగా రద్దు కాలేదు. ఉజ్వల లబ్ధిదారులకు ఇప్పటివరకు అందుతున్నట్లుగానే ఒక్కో 14.2 కిలోల సిలిండర్‌పై రూ. 300 సబ్సిడీ కొనసాగుతుంది. కానీ ఈ రాయితీ ఇకపై ఏడాదిలో మొదటి నాలుగు రీఫిల్లులకే వర్తించనుంది. ఆ తర్వాత తీసుకునే సిలిండర్లకు పూర్తి మార్కెట్ ధర చెల్లించాల్సి ఉంటుంది. ఇటీవల అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు పెరగడం, దేశీయంగా వంటగ్యాస్ ధరలు వరుసగా పెరుగుతుండటం కూడా ఈ నిర్ణయం చర్చనీయాంశంగా మారడానికి కారణమైంది. ఇప్పటికే గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరలు పెరిగిన నేపథ్యంలో సబ్సిడీ పరిమితి తగ్గించడం పేద కుటుంబాలపై అదనపు భారం మోపే అవకాశముందని పలువురు ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ప్రభుత్వం మాత్రం నిజమైన వినియోగ అవసరాలకు అనుగుణంగా సబ్సిడీని పునర్వ్యవస్థీకరించామని, పథకం లక్ష్యాలను కొనసాగిస్తూనే వ్యయ నియంత్రణకు ప్రాధాన్యత ఇచ్చామని స్పష్టం చేసింది

# పెరిగిన బంగారం ధరలు..



హైదరాబాద్ : గత వారం రోజులుగా వరుసగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు నేడు ఒక్కసారిగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధరలు ఎగబాకడంతో దేశీయ మార్కెట్‌లోనూ అదే ప్రభావం కనిపించింది. మరోవైపు వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి. బులియన్ మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం, నేడు ఉదయం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,53,160కు చేరుకుంది. గత ముగింపు ధరతో పోలిస్తే రూ. 1,470 మేర పెరుగుదల నమోదైంది. అదే విధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,350 పెరిగి రూ. 1,40,400 వద్ద కొనసాగుతోంది. నగరంలో కిలో వెండి ధర రూ. 2.70 లక్షల వద్ద స్థిరంగా ఉంది. దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు భారీగా పెరిగాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,54,910కు చేరుకోగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,42,000గా నమోదైంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,53,160గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,40,400గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,53,310కు చేరగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,40,550గా నమోదైంది. దేశవ్యాప్తంగా సగటున 10 గ్రాముల బంగారం ధరపై రూ. 1,450 వరకు పెరుగుదల కనిపించింది. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులు మరోసారి ధరల పెరుగుదలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా పసిడి ధరలు బలంగా ట్రేడవుతున్నాయి. ఒక ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర నిన్నటితో పోలిస్తే 0.6 శాతం పెరిగి 4,330 డాలర్లను దాటింది. మరోవైపు వెండి ధర మాత్రం 1 శాతం తగ్గి ఔన్స్‌కు 67 డాలర్ల వద్ద కొనసాగుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, డాలర్ కదలికలు, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయి. రాబోయే రోజుల్లో కూడా పసిడి ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily
శుక్రవారం, 19 జూన్ 2026

# ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన బ్రాహ్మణపల్లె విద్యార్థి



పులివెందుల మనస్సాక్షి : దేశ భవిష్యత్తు పార్లమెంటులో కాదు, పాఠశాలల్లోనే నిర్మితమవుతుందని బ్రాహ్మణపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మార్తమ్మ అన్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె జెడ్పీ హైస్కూల్లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 575 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన రామట్లపల్లెకు చెందిన లోమడ యజ్ఞేశ్ యాదవ్ ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో యజ్ఞేశ్‌ను,అతని మాతృమూర్తిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మార్తమ్మ మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో నైపుణ్యం గల విద్యార్థులు ఉన్నారని,సుశిక్షితులైన ఉపాధ్యాయులు వారి ప్రతిభకు సానపడితే అబ్దుల్ కలాం లాంటి శాస్త్రవేత్తలు,మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి ఇంజనీర్లు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. నేటి ప్రతిభావంతులైన విద్యార్థులే రేపటి దేశ ప్రగతికి దశాదిశా నిర్దేశకులుగా మారతారని ఆమె కొనియాడారు. బయాలజీ ఉపాధ్యాయుడు అన్నారెడ్డి సుధాకర్ రెడ్డి,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఇమ్మానుయేల్ తదితరులు విద్యార్థికి నగదు ప్రోత్సాహక బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాష్ రెడ్డి,నాగయ్య,రామాంజనేయరెడ్డి,విజయ్ కుమార్ రెడ్డి,నాగ రవీంద్రారెడ్డి,రఘునాథ రెడ్డి,ఖేల్ కర్,వనిత తదితరులు పాల్గొన్నారు.

# వనిపెంటలో బాలికల గురుకుల జూనియర్ కళాశాల ప్రారంభం



మైదుకూరు మనస్సాక్షి : మైదుకూరు మండలం వనిపెంటలో బాలికల గురుకుల జూనియర్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ,జిల్లా కలెక్టర్ శ్రీధర్,మైదుకూరు ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ హాజరై కళాశాలను ప్రారంభించారు. మంత్రి సవితమ్మ మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ చేస్తున్న కృషిని అభినందించారు. కళాశాలకు అవసరమైన అన్ని వసతులను కల్పించి,విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి వాటి ప్రాధాన్యతను వివరించారు.ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ,వనిపెంట బాలికల గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసి ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే తరగతులు ప్రారంభించేందుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,విద్యా,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్,ఇన్‌చార్జి మంత్రి సవితమ్మ,జిల్లా కలెక్టర్ శ్రీధర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంత బాలికలకు ఉన్నత విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని,ఈ జూనియర్ కళాశాల ద్వారా విద్యార్థినులు ఉన్నత విద్యావకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# ఉప్పరపల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించిన రామిరెడ్డి ధ్వజారెడ్డి



రైల్వే కోడూరు మనస్సాక్షి: రైల్వే కోడూరు మండలం ఉప్పరపల్లి హరిజనవాడ గ్రామం నందు నిర్వహించిన శ్రీ శ్రీ గంగమ్మ తల్లి జాతర సందర్భంగా, గ్రామస్తుల ఆహ్వానం మేరకు హాజరై గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన వైసీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి. గ్రామానికి విచ్చేసిన రామిరెడ్డి ధ్వజారెడ్డిని గ్రామస్తులు గ్రామ పెద్దలు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంగల్ రెడ్డి, దార్ల చంద్రశేఖర్, గోపి, సుబ్రహ్మణ్యం రాజు,మల్లు కృష్ణ రెడ్డి, రమణ రెడ్డి, బత్తల సుబ్రమణ్యం, ప్రసాద్,కుంచం హరి, నాగరాజు , మహేష్, నితీష్, హరి, లక్ష్మీపతి , ఉప్పరపల్లి గిరి, వైసీపీ పార్టీ నాయకులు, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీచ్ షాక్స్ పై ఉన్న శ్రద్ధ రైతులపై లేదా?

## -సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందా?
## -గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఫైర్



తాడేపల్లి మనస్సాక్షి: బీచ్ షాక్స్ పేరుతో సముద్ర తీరాల్లో మద్యం విక్రయాలు చేయాలన్న ఆలోచనలో ఉన్న శ్రద్ధ రైతులను ఆదుకోవడంలో పదో వంతు కూడా కూటమి ప్రభుత్వానికి లేదని వైయస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా రెండేళ్ల పాలనలో రైతులకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచాడని, మొక్కజొన్న, శెనగ, పొగాకు, మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదన్నారు. కేంద్రంతో మాట్లాడి పంటలకు మద్ధతు ధర దక్కేలా ప్రయత్నం చేయాలన్న కనీస జ్ఞానం కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. రెండేళ్లలో ఆత్మహత్య చేసుకున్న ఏ ఒక్క రైతు కుటుంబానికి పైసా పరిహారం కూడా అందించి ఆదుకోలేదని మండిపడ్డారు. ఉచిత విద్యుత్, 90 శాతం సబ్సిడీకి డ్రిప్పు పరికరాలు అందించి రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా వైయస్సార్ గారు తీర్చిదిద్దితే అది తన చొరవేనని చంద్రబాబు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన శ్రీకాంత్‌రెడ్డి ఆక్షేపించారు. ప్రెస్‌మీట్‌లో గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఇంకా ఏం మాట్లాడారంటే... కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్కువగా నష్టపోయింది రైతులే. వైయస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయం పండగలా సాగితే చంద్రబాబు వచ్చాక దండగ అనే విధంగా మార్చేశాడు. రైతులకు కనీసం సబ్సిడీ ఎరువులు, సబ్సిడీ విత్తనాలు కూడా అందించలేని దౌర్భాగ్యపు ప్రభుత్వాన్ని చంద్రబాబు నడిపిస్తున్నాడు. రైతులు పండించిన ఏ పంటకూ కనీసమ మద్ధతు ధరలు దక్కక అప్పులపాలవుతున్న పరిస్థితులు. దీంతో గడిచిన రెండేళ్లలో ఆత్మహత్యలు చేసుకున్న ఏ ఒక్క బాధిత కుటుంబానికి కూడా పరిహారం అందించిన పాపాన పోలేదు. రైతు సమస్యలపై వైయస్ జగన్ గారు ప్రస్తావిస్తే, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేస్తే ఆయన కుటుంబాన్ని రాజకీయాల్లోకి లాగి పదే పదే వ్యక్తిత్వ హననం చేస్తున్నారు. మొక్కజొన్న, పొగాకు, శనగ, వేరుశెనగ రైతులు నిండా మునిగిపోయారు. మామిడి రైతుల బాధలను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కేంద్రంతో మాట్లాడి న్యాయం చేసే కనీస ప్రయత్నం కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కరువైంది. వైయస్సార్‌సీపీ హయాంలో కరోనా లాంటి సంక్షోభంతో రెండేళ్లు ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అయినా ఏ ఒక్క సంక్షేమ పథకాన్నీ కూడా ఆపలేదు. ఆర్బీకే సెంటర్ల ద్వారా విత్తనం నుంచి విక్రయం వరకు రైతులకు అండగా నిలవడం జరిగింది. ఖరీఫ్, రబీ సీజన్లలో అదును రాకముందే సబ్సిడీకి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేవాళ్లం. సీఎం యాప్ ద్వారా రైతులకు మద్ధతు ధరలు దక్కేలా మార్కెట్ ని నిరంతరం మానిటరింగ్ చేసే గొప్ప వ్యవస్థ ఉండేది. పంటలకు ఈ క్రాపింగ్ జరిగేది. మట్టి పరీక్షలు నిర్వహించేవాళ్లం. సీజన్ ముగియకుండానే పంట నష్టపరిహారం అందించి రైతులకు అండగా నిలిచిన గొప్ప నాయకుడు వైయస్ జగన్ గారు. పెట్టుబడి సాయం కింద ఐదేళ్లలో ఒక్కో రైతుకి రూ.67,500 అందించాం. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నదాత సుఖీభవ అని పేరు మార్చి కేంద్రంతో సంబంధం లేకుండా ఒక్కో రైతుకి ఏడాదికి రూ. 20 వేలు పంట పెట్టుబడికి అందిస్తానని హామీ ఇచ్చాడు. మొదటి ఏడాది ఒక్కరూపాయి సాయం అందించలేదు. రెండో ఏడాది కూడా దాదాపు 8 లక్షల మంది రైతులకు పైగా పథకానికి అనర్హులుగా చేశారు. వైయస్సార్‌సీపీ హయాంలో కౌలు రైతులకు కూడా రైతు భరోసా అమలు చేస్తే నేడు కూటమి ప్రభుత్వం కౌలు రైతులను అస్సలు రైతులుగానే పరిగణించడం లేదు. గతంలో రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి ఎలాగైతే మాసం చేశాడో ఇప్పుడూ అదే పనిచేస్తున్నాడు. రైతులంటే చంద్రబాబుకి ఎప్పుడూ చిన్నచూపు. వారేం చేయలేరులే, ప్రశ్నించలేరులే అనే ధైర్యం. నాడు ఉచిత విద్యుత్ ఇస్తే కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకోవాలన్న చంద్రబాబు రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా చేస్తానని గొప్పలు చెబుతున్నాడు. వైయస్సార్ గారు ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల, 90 శాతం సబ్సిడీకి డ్రిప్‌లు ఇవ్వడం వల్ల, రాయలసీమలో ఉపాధి హామీ పథకం ప్రారంభించడం వల్ల, మొక్కలు ఉచితంగా పంపిణీ చేయడం వల్ల రాయలసీమ హార్టీ కల్చర్ హబ్‌గా మారింది. దానికి నేనే కారణమని చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాయలసీమలో అరటి, చీనీ, టమాట, దోస, చెరకు, మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మామడి రైతులు జ్యూస్ ఫ్యాక్టరీల ముందు కి.మీ క్యూ కట్టినా చంద్రబాబుకి కనిపించడం లేదా? ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లలో తిరుగుతూ విలాసాల కోసం కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వ పెద్దలు, రైతులను మాత్రం ఆదుకోవడం లేదని శ్రీకాంత్‌రెడ్డి ఆక్షేపించారు.

# చైతన్య సర్వీస్ సొసైటీ విద్యార్థులు,వృద్ధులకు అన్నవితరణ

**- దాత ఆదినారాయణ దంపతులకు ఘనసన్మానం**




మదనపల్లె మనస్సాక్షి: హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో గురువారం చైతన్య స్వచ్ఛంద సంస్థలో విద్యార్థులు మరియు వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ ఆదినారాయణ సమాజంలో నిరుపేదలు,వృద్ధులు,అనాథ విద్యార్థులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో సేవాకార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. విద్యార్థులకు పోషకాహారం అందించడం,వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు తోడ్పాటు అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా పలువురు సామాజిక కార్యకర్తలు,స్వచ్ఛంద సేవకులు పాల్గొని సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఏ.కవితా రాణి మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ కమిషన్ ద్వారా విచ్చేసిన సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేయాలని కోరారు. అనంతరం ఆదినారాయణను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా విజిలెన్స్ డైరెక్టర్ డాక్టర్ వన్నప్ప,మెడికల్ డైరెక్టర్ అంజాద్ బాషా,మంజునాథ్,సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నిబంధన నుండి మినహాయింపునివ్వాలి

**- ఆపస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన**



మదనపల్లె మనస్సాక్షి: 2010 టెట్ నోటిఫికేషన్ జారీకి ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అనే నిబంధన నుండి మినహాయించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్షుడు ఎం.నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పార్లమెంటులో చట్ట సవరణ చేసి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి,జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సొరకాయల శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పరశురాం,రాష్ట్ర కార్యదర్శి మధుమతి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు నాయక్,జిల్లా సహాధ్యక్షులు నాగేంద్రబాబు,పచ్చర్ల సుధాకర్,జిల్లా కార్యదర్శి శేఖర్ రెడ్డి,వెంకటరమణ,హేమలత,రాజా,రేపన ఆంజనేయులు నాగేంద్ర ప్రసాద్,నారాయణ నాయక్,నాగరాజా తదితర ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ నిరసన కార్యక్రమం అనంతరం జిల్లా రెవిన్యూ అధికారి చంద్రశేఖర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించడం జరిగింది. అదేవిధంగా ఈ వినతి ప్రధానమంత్రి,ముఖ్యమంత్రి,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తదితరులకు పంపించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులకు పనిచేస్తున్న వారికి ఈ నిబంధన ఇబ్బంది కలిగిస్తుందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.



# జమ్మలమడుగు రూరల్ సీఐగా కులయప్ప బాధ్యతల స్వీకరణ




జమ్మలమడుగు మనస్సాక్షి: జమ్మలమడుగు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్.కులయప్ప గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో ఎస్సైగా,సీఐగా పనిచేసిన అనుభవం కులయప్పకు ఉంది. జమ్మలమడుగు రూరల్ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తానని ఆయన తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని,సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# సస్పెండైన సీఐ నాగరాజుపై సంచలన ఆరోపణలు

విజయవాడ మనస్సాక్షి : కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేసి ఇటీవల సస్పెండైన నాగరాజుపై మరో తీవ్ర ఆరోపణ వెలుగులోకి వచ్చింది. గత నెల 21న ఆత్మహత్య చేసుకున్న క్రాంతి కుమార్ అనే యువకుడు,ఆత్మహత్యకు ముందు తీసుకున్న సెల్ఫీ వీడియో ఇప్పుడు సంచలనం రేపుతోంది. ఆ వీడియోలో 'సీఐ నాగరాజు తనను వెంటాడి కొడుతున్నాడని,తన ఆత్మహత్యకు సీఐ నాగరాజే కారణమని' క్రాంతి కుమార్ ఆరోపించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలు ఆరోపణలతో సస్పెన్షన్‌లో ఉన్న సీఐ నాగరాజుపై ఈ సెల్ఫీ వీడియోతో మరిన్ని వివాదాలు చుట్టుముట్టే అవకాశం ఉంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# పంచాయతీరాజ్ లో దుర్వినియోగం జరిగిన డబ్బు రికవరీ చేయాలి

**-డివైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి వీరణాల శివకుమార్**



జమ్మలమడుగు మనస్సాక్షి:డివిజన్ పంచాయతీ రాజ్ లో 5కోట్ల రూపాయలు దుర్వినియోగం లో సస్పెన్షన్ కాదని వారి నుండి డబ్బు రికవరీ చేయాలని నిందితుల పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డివైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేసారు.స్థానిక ఎన్జీవో కార్యాలయం నందు విలేఖరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జమ్మలమడుగు డివిజన్ పంచాయతీ రాజ్ శాఖలో 5కోట్ల రూపాయలు అవినీతి కి పాల్పడిన వారిని సస్పెన్షన్ చేసి చేతులు దులుపుకునే సరిపోదని ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగపాలు చేసిన నిందితుల నుండి డబ్బు రికవరీ చేసి కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.పంచాయతీ రాజ్ లో ఈఈ గా పని చేసి రిటైర్డ్ అయినా శ్యాంసుందర్ రాజు ను విచారించి ఇందులో ఎవరెవరి హస్తం ఉంది కోట్ల రూపాయలు డబ్బులు ఎలా దుర్వినియోగం అయ్యిందో విచారణ జరిపించాలని అన్నారు.జిల్లాలో ఇప్పటికే ప్రొద్దుటూరులో హౌసింగ్ శాఖ సుబ్రమణ్యం కోట్ల రూపాయలు విలువజేసే ఇనుము మయం విచారణ జరుగుతుండగానే మరోసారి ఇప్పుడు జమ్మలమడుగు పంచాయతీ రాజ్ శాఖ లో కోట్ల రూపాయలు అవినీతి బయటపడటం దారుణం అన్నారు.ప్రభుత్వం ఇటువంటి వాటిపైన కఠినంగా వ్యవహరించసిన అవసరం ఉన్నదని ప్రభుత్వ సొమ్మును అవినీతికి పాల్పడిన వారిని సస్పెన్షన్ కాదని ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించి నిందితుల నుండి డబ్బు రికవరీ చేసి అరెస్టు చేస్తే కానీ ఇటువంటివి పునరావృతం కావన్నారు.జమ్మలమడుగు పంచాయతీ రాజ్ శాఖలో కోట్ల రూపాయలు అవినీతి పై సమగ్రంగా విచారించి ఇంకెవరెవరి హస్తం ఉంది తెలుసుకొని నిందితుల నుండి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టౌన్ కమిటీ సభ్యులు సుభాహన్,అరుణ్ పాల్గొన్నారు.

# జూన్ 24న శ్రీ భోగశ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్ర కలశాభిషేకం

తిరుమల, 2026 మనస్సాక్షి:: తిరుమల, 2026 జూన్ 18: శ్రీవారి పంచ బేరాలలో ఒకటైన శ్రీ భోగ శ్రీనివాసమూర్తిని తిరుమల శ్రీవారి ఆలయంలో పల్లవరాణి సామవై కొన్ని వందల సంవత్సరాల మునుపు ప్రతిష్ఠించిన రోజును పురస్కరించుకుని ఆలయంలో జూన్ 24వ తేదిన ప్రత్యేక సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు, శ్రీ భోగ శ్రీనివాసమూర్తి, శ్రీ విష్వక్సేనులవారిని వేంచేపు చేస్తారు. శ్రీవారి మూలమూర్తికి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో కౌతుకమూర్తి అయిన శ్రీ మనవాళపెరుమాళ్(శ్రీ భోగ శ్రీనివాసమూర్తి)ను, ఆయన కు అభిముఖంగా శ్రీ విష్వక్సేనులవారిని ఆశీనులు చేస్తారు. తర్వాత శ్రీవారి మూలమూర్తిని శ్రీ భోగ శ్రీనివాసమూర్తికి కలుపుతూ దారం కట్టి అనుసంధానం చేస్తారు. అనంతరం వేద పండితులు వేద పారాయణం చేయగా, అర్చకస్వాములు ప్రత్యేక సహస్ర కలశాభిషేకాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. కాగా ఆ నాడు శ్రీవారి ఆలయంలోని ఆర్జిత సేవలన్నీ యథావిధిగా నిర్వహించనున్నారు.

# శంకరన్న కు రక్తదానం తో శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు

**-మీ రక్తదానం మరొకరికి ప్రాణదానం-- డాక్టర్ చైతన్య**



పులివెందుల మనస్సాక్షి: వైకాపా నాయకులు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి జన్మదినం సందర్భంగా శంకర గ్యాస్ట్రో హాస్పిటల్ ఆధ్వర్యంలో సి.ఎస్.ఐ ఫంక్షన్ హాల్ నందు డిఎస్ఆర్ యువసేన దేని గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని శంకర గ్యాస్ట్రో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చైతన్య, రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కళ్యాణ్,వైకాపా సింహాద్రిపురం ఇన్‌చార్జ్ శ్రీకాంత్ రెడ్డి కలిసి పుట్టినరోజు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకుని రక్తదాన శిబిరం ప్రారంభించారు.అలాగే తొండూరు మండలం నుండి రక్తనిధి యందు 10 మంది శంకరన్న అభిమానులు కలిపి మొత్తం 60 మంది అభిమానులు రక్తదానం చేయడం అభినందనీయం. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ,"మీ రక్తదానం మరొకరికి ప్రాణదానం. ప్రమాదాలు,అత్యవసర శస్త్రచికిత్సలు,ప్రసవాలు మరియు ఇతర వైద్య అవసరాల సమయంలో రక్తం ఎంతో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా రక్తదానం చేయడం ద్వారా సమాజానికి గొప్ప సేవ చేసిన వారవుతారు" అని అన్నారు. రక్తదానం చేసిన యువతను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. యువతలో సేవాభావం పెంపొందడం సమాజానికి మంచి సంకేతమని పేర్కొన్నారు. రక్తదానం వల్ల ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని,దీనిపై ఉన్న అపోహలను ప్రజలు విడనాడాలని సూచించారు. డాక్టర్ కళ్యాణ్ మాట్లాడుతూ రక్తనిధుల్లో ఎల్లప్పుడూ తగినంత రక్త నిల్వలు ఉండేందుకు స్వచ్ఛంద రక్తదాతలు ముందుకు రావాలని కోరారు. రక్తదానం ద్వారా ఒకేసారి పలువురి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు,వైకాపా నాయకులు,యువజన కార్యకర్తలు,రక్తనిధి,వైద్య సిబ్బంది,రక్తదాతలు,అభిమానులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిబిరంలో పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు.

# అపద్దాలు మోసాలు రెండేళ్ల విజయాలు

**-ప్రైవేట్ ఈవెంట్ గా మారిన ప్రభుత్వ కార్యక్రమం**

**-తహసీల్దార్ లకు వాచ్ మెన్ డ్యూటీ లు**

**-వాహనాల పార్కింగ్ కాపలాదారులుగా**

**-రెవిన్యూ అధికారులు**

**-వైసిపి ఎస్ ఈ సి సభ్యుడు సత్య సాయినాథ్ శర్మ ధ్వజం**



కమలాపురం,(మనస్సాక్షి):రాష్ట్ర ప్రజలకు మోసాలు, అబద్ధాలు ప్రజలను వాడుకుని వదిలేయడాలు ఇవి ఈ రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాల కాలంలో సాధించిన గొప్ప ప్రజా విజయాలని వైసిపి రాష్ట్ర ఎస్ ఈ సి సభ్యుడు తెలుగు నాడు ప్రజాసేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ధ్వజమెత్తారు. కమలాపురం లో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ప్రజలకు అపద్దాలు చెప్పి మాయ మాటలతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల విజయోత్సవాలు చేసుకోవడానికి సిగ్గుగా లేదా అని ప్రశ్నించారు. ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలుపుకోలేని కూటమి నాయకులు ఏమి సాధించినామని ఉత్సవాలు నిర్వహిస్తున్నారో చెప్పాలన్నారు. అబద్దాలను మోసాలను పక్కకు నెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, ప్రభుత్వ అధికారుల భాగస్వామ్యంతో అధికారుల ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల విజయోత్సవాలు నిర్వహించుకోవడం కూటమి ప్రభుత్వ పాలకుల చేతకానితనానికి నిదర్శనంగా పేర్కొన్నారు. కడపలో గురువారం నిర్వహించిన రెండు సంవత్సరాల విజయోత్సవ సభ ప్రభుత్వ కార్యక్రమమా లేక ప్రవేట్ ఈవెంటా అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమం అయితే సభా వేదికపై కూటమి అనధికార నాయకులు, ప్రభుత్వ పదవులు ఏవీ లేని పార్టీ పదవులు ఉన్న నాయకులు, పార్టీ పదవులు సైతం లేని నాయకులు ఎలా వేదికపై అధికారుల సమక్షంలో ముఖ్య అతిథుల స్థానంలో కూర్చుంటారన్నారు. ఈ సమావేశం నిర్వహణ పై ఉన్నతాధికారులు నియంత్రణ పూర్తిగా కోల్పోయారన్నారు .తెలుగుదేశం పార్టీ, ఇతర కూటమి పార్టీ కార్యకర్తలు వచ్చే వాహనాలకు కాపలాగా రెవిన్యూ అధికారులు నియమించడం, ముఖ్యమంత్రి సమావేశం లాగా కడప రెవెన్యూ డివిజన్లోని 26 మంది రెవెన్యూ అధికారులను ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు పర్యవేక్షణ కోసం నియమించడం చూస్తుంటే అధికార యంత్రాంగాన్ని కూటమి పాలకుల వద్ద తాకట్టు పెట్టినట్టు ఉందన్నారు. సాధారణ గ్యాలరీలలో కార్యకర్తలను కూర్చొన పెట్టడానికి తాహసిల్ధర్ లను, డిప్యూటీ తహసిల్దారును నియమించారంటే రాష్ట్రం లో పాలన ఎక్కడికి దిగజారిందో అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రం అప్పుల పాలు కాకుండా సంపద సృష్టిస్తానని మోసపూరిత మాటలు చెప్పిన చంద్రబాబు నాయుడు ఇంతవరకు ఒక రూపాయి సంపద సృష్టించకపోగా నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచి ప్రజలపై అధిక పనులు భారం మోపి రెండు సంవత్సరాలు ఉత్సవాలు నిర్వహించుకోవడం ఈ రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేసినట్లు కాదా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాల సభను విజయవంతం చేసుకొవడానికి కూటమి నాయకులు ప్రభుత్వ ఉన్నతాధికారులు ఎంత ప్రయత్నం చేసినప్పటికీ ప్రజలు సభ నిర్వహణ పట్ల ఆసక్తి కనపరచక పోవడాన్ని గమనిస్తే ఈ ప్రభుత్వం పై ప్రజలకు ఎంత నమ్మకం ఉందో అర్థమవుతోందన్నారు. ముఖ్యమంత్రి సభకు అధికారులను వాడుకున్నట్లుగా కూటమి నాయకుల సాధారణ సభకు సైతం కడప రెవెన్యూ డివిజన్లోని అధికారులను వాడుకోవడం చాలా శోచనీయమన్నారు. గతంలో ముఖ్యమంత్రి ప్రధానమంత్రి సభలకు తప్పితే మిగిలిన నాయకులు ఎవరు వచ్చినా ఎవరు సమావేశాలు నిర్వహించిన అధికార యంత్రాంగాన్ని ఇంత చీప్ గా వాడుకున్న సందర్భాలే లేవని సంబంధిత అధికారులే వాపోతున్నారని ఆయన పేర్కొన్నారు .

# రాష్ట్రంలో రెండేళ్ల పాలన, నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం" పై విజయోత్సవ సభ



కడప మనస్సాక్షి : రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం కడప నగరంలోని పుత్తా ఎస్టేట్‌లో "రాష్ట్రంలో రెండేళ్ల పాలన, నమ్మకం -- అభివృద్ధి - సంక్షేమం" పై ఏర్పాటు చేసిన విజయోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి పరిశ్రమల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత , జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి , జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ లతో పాటు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి గ మాట్లాడుతూ, కడప జిల్లాలో సుమారు 4,500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. అలాగే ప్రతిపాదిత పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్, సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా జిల్లాకు సుమారు రూ.1.07 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. విద్య, ఉపాధి, మౌలిక వసతులు, ఇంధన రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో కడప జిల్లాను రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

Editor, Printed, Published and Owned by VASANTHA SREENIVASULA REDDY, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 51600. RNI REG NO:- APTEL/26/A0309.
Printed at. VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 516002. Editor: VASANTHA SREENIVASULA REDDY, E-mail: sreenu1167@gmail.com, Cell: +91 8341698284